క్లుప్తంగా

గిద్దలూరులో మోస్తరు వర్షం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. నగర పంచాయతీ కార్యాలయం తోపాటుగా అంకాలమ్మబజారు, కోటగడ్డ బజారు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరంతా లోతట్టు ప్రదేశాలల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగర పంచాయతీ ప్రధాన రహదారి నుంచి వచ్చిన వర్షపు నీరు కార్యాలయం ముందుభాగంలో నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఆ వీధుల మీదుగా నడిచేందుకు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


మాట్లాడుతున్న ఎంఈఓ అబ్దుల్ సత్తార్

కంభం: స్థానిక మనస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులు హిందీ భాష ఔన్నత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో అర్ధవీడు ఎంఈఓ టి.అబ్దుల్ సత్తార్, బేస్తవారిపేట ఎంఈఓ బి.కాశయ్య, హెచ్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.మహబూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు సుబానీ, జిల్లా గౌరవాధ్యక్షుడు పిచ్చయ్య, మార్కాపురం డివిజన్ హెచ్‌టీయూ అధ్యక్షులు ఖాసింవలి, సభ్యులు టీవీ భాస్కర్, సనాఉల్లా, సునీల్, నాయుడు, బాలాజీ, జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


విజయవాడలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస ప్రసాద్

కంభం: స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్ పలువురు దాతల సహకారంతో ఆదివారం విజయవాడలో వరద బాధితులకు 19 రకాల నిత్యావసర వస్తువుల కిట్లు అందజేశారు. విజయవాడలోని సితార సెంటర్, కండ్రిక, బుడమేరు ప్రాంతం, ప్రకాష్ నగర్, రాజీవ్ నగర్‌లో 125 వరద బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేసినట్లు వివరించారు. వరద బాధితుల సహాయ నిధికి 72 మంది దాతలు రూ.85249ను విరాళంగా అందజేసినట్లు ప్రకటించారు.

జిల్లా స్థాయి కబడ్డీకి గిద్దలూరు క్రీడాకారులు


జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల 19 నుంచి నిర్వహించిన స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీలో సత్తా చాటారు. అండర్–14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు ఎంపికై నట్లు పోటీల కోఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు తెలిపారు. అండర్ 17 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు అట్టహాసంగా నిర్వహించి ముగించారు. ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ మహిళలు

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేట చిన్న మసీదు ప్రాంగణంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ కార్యక్రమాన్ని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు నూర్జహాన్ మాట్లాడుతూ.. సమాజంలో నేడు మితిమీరిన స్వేచ్ఛ పేరుతో చోటుచేసుకున్న అనర్థాల వల్ల మహిళలపై చెడు ప్రభావం చూపుతోందన్నారు. మంచి ప్రవర్తనతో కూడిన స్వేచ్ఛ సమాజానికి మంచిదన్నారు. నైతిక ప్రమాణాలతో కూడిన స్వేచ్ఛను సాధించే ఉద్దేశంతో ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. యువత మద్యపానం, డ్రగ్స్ వంటి దుర్వ్యసనాల బారిన పడుతున్నారని, అశ్లీల కంటెంట్‌ను అప్లోడ్ చేయడంలో మన ఏపీలోనే 10 వేలకు పైగా కేసులు నమోదవడం అనేది అత్యంత ఆందోళనకు గురిచేస్తోందన్నారు.

పీహెచ్‌సీల్లో

వైద్య సేవలు బంద్


వైద్యులు లేక రోగులు రాక లేక వెలవెలబోతున్న వైద్యశాల


నిర్మానుష్యంగా ఉన్న ఆస్పత్రి లోపలి వైపు


చందలూరు పీహెచ్‌సీ వైద్యశాల

- జీఓ నంబర్ 85 రద్దు చేయాలని కోరుతూ సేవలు బహిష్కరించిన వైద్యులు
- ఆస్పత్రులకు వచ్చి వైద్యులు లేక తిరిగి వెళ్తున్న రోగులు
- వెల వెలబోతున్న పీహెచ్‌సీలు

దర్శి: వైద్యులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారికి ఇబ్బందులు తెచ్చి పెట్టే జీఓలు తీసుకొచ్చి వైద్యుల సహనానికి పరీక్షలు పెడుతోంది. దీంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట పట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల పీజీ సర్వీస్ కోటాను కుదిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 85 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు సేవలు బహిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సురేష్‌కుమార్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. సెప్టెంబర్ 17వ తేదీ ఉదయం విజయవాడ ధర్నా చౌక్‌లో వెయ్యి మందికి పైగా ఏపీపీహెచ్‌సీడీఏ డాక్టర్లు పాల్గొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ డిమాండ్‌లు నెరవేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసి వైద్యులందరూ తమ హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా కలసికట్టుగా ఆందోళన విజయవంతం చేశారు. దీంతో ఈనెల 18వ తేదీ జీఓ నంబర్ 85తో పాటు వివిధ డిమాండ్లపై ఆంధ్ర ప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల అసోసియేషన్‌తో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఆ చర్చలు పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. దీంతో గత్యంతరం లేక సమ్మెను అలాగే కొనసాగిస్తున్నారు. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్ వంటి ఇతర ముఖ్యమైన సమస్యలపై వైద్యులు ప్రశ్నించినా ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన పీహెచ్‌సీలపై ఆ ప్రభావం పడుతోంది. స్పెషల్ పీఎస్‌లు, కమిషనర్‌లు కూడా ఎచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ హామీలు నెరవేర్చలేదు.

ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్తున్న రోగులు

దర్శి నియోజకవర్గంలోని దర్శి మండలం చందలూరు, తాళ్లూరు, కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు వంటి మండల కేంద్రాల్లో పీహెచ్‌సీలు న్నాయి. రూరల్ మండల కేంద్రాలలో ఎంబీబీఎస్ వైద్యులు ఉండే ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఉండవు. చిన్న చిన్న రోగాలకు ఆర్‌ఎంపీలను సంప్రదించినా తీవ్రమైన రోగాలు ఉన్న పేదవారు డబ్బు ఖర్చు చేసి ఎటువెళ్లాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక రోగంతో ఒక్కో పీహెచ్‌సీకి సుమారు 80 నుంచి 100 ఓపీలు వరకు వస్తుంటాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. దీంతో వైద్యులు లేక ఆస్పత్రులు వెలవెలబోతున్నాయి. సిబ్బంది ఉన్నా డాక్టర్ మందులు రిఫర్ చేస్తేనే వైద్యం చేసేందుకు వీలవుతుంది. దీంతో పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు ఖర్చు చేసి వైద్యం చేయించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

దోచుకుంటున్న ప్రైవేటు వైద్యశాలలు

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. అవసరాన్ని బట్టి వైద్యాన్ని వ్యాపారంగా మార్చి వసూలు చేసే వైద్యశాలలకు పేదలు వెళ్లాలంటే తమ స్థోమతకు మించిన పనే. ప్రైవేటు వైద్యశాలల్లో మందులకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కూలీ నాలీ చేసుకునే పేదలు ఆ డబ్బు చెల్లించలేక ప్రభుత్వ వైద్యం అందించే వారు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

గర్భిణుల పరిస్థితి దయనీయం:

ఎప్పుడు నొప్పులు వస్తాయో తెలియని గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కాన్పులు అయ్యే పరిస్థితుల్లో ఉన్న గర్భిణులు అత్యవసరంగా డాక్టర్ కోసం సుదూర ప్రాంతాలకు పోవాల్సి వస్తోంది. ఈ లోపు ఏదైనా జరగరానిది జరిగితే దానికి బాధ్యత ఎవరు వహించాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. వైద్యం కోసం వచ్చిన ఆటోలు, ఇతర వాహనాల్లో సుదూర ప్రాంతం ప్రయాణించి ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి తోడు ప్రైవేటు వైద్యశాలల్లో వేలాది రూపాయలు చెల్లించే స్థోమత లేక, రవాణా ఖర్చులు భరించలేక పేదలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్‌లైనా లేకపోవడం దుర్మార్గంగా ఉందని పేద రోగులు మండి పడుతున్నారు.

నీటి కోసం రాస్తారోకో


ఆందోళన నిర్వహిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

పెద్దదోర్నాల: తమకు కొన్ని రోజులుగా నీరు లేక ఇబ్బందులు పడుతున్నా, అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తూ అయినముక్కల ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం కర్నూల్, గుంటూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చి కంపను రోడ్డుకు అడ్డంగా వేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో పలు వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. అధికారులు స్పందించి తమ కాలనీకి నీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు


పెద్దారీడు.. ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ దేవత

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత, ఎస్. కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించారు. నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కుబడులు చెల్లించారు.

గోపిరెడ్డికి ఘన సన్మానం


గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితుల గురించి చర్చించి ఆయనకు సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌లు కె.వెంకటేశ్వర రెడ్డి, ఏకుల ముసలారెడ్డి, కోటిరెడ్డి, నాయకులు కందూరి గురుప్రసాద్, వై.వెంకటేశ్వరరెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా వాగుమడుగు-గనివానిపాడు రోడ్డు


గనివానిపాడు రోడ్డు దుస్థితి ఇదీ..

కొనకనమిట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు రహదారులు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే తారు రోడ్డు దెబ్బతిని కంకర పైకి తేలడంతోపాటు అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా రహదారి మధ్యలో ఉన్న చప్టాల వద్ద ఇరువైపుల రోడ్డు కోతకు గురైంది. అలాగే గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురైంది. రహదారులను బాగు చేయాలని గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, స్థానికులు విజ్ఞప్తి చేశారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన

ముండ్లమూరు (దర్శి): దళిత బహుజన రీసోర్స్ సెంటర్ వారి సహకారంతో ఒంగోలులోని సినార్డ్ కార్యాలయంలో సోమవారం స్త్రీ – పురుష సమానత్వంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేస్తామని డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగ సమానత్వం, మానవ హక్కులు, సాధికారిత పెంపొందించడం లాంటి వాటి పట్ల మహిళలను చైతన్య వంతులను చేసేందుకు గాను ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. పలు రంగాల్లో మహిళలు ఉన్నత శిఖరాలకు సైతం సమానత్వం దక్కక పోవడంపై గల కారణాలను చర్చిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు నేడు సోమవారం ఉదయం ఒంగోలులోని రైల్‌పేట సమీపంలో గల సినార్డ్ కార్యాలయంలో జరిగే సదస్సులో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

దొనకొండ: గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని దున్నుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అన్యాక్రాంతానికి పాల్పడి ప్రభుత్వ భూములు దున్నుకుంటే తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఈకేవైసీ తప్పని సరి


ఈకేవైసీ పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: ఖరీఫ్ 2024 సంవత్సరంలో పంట నమోదు చేయించుకున్న రైతులందరూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలియజేశారు. మండలంలోని సుమారు 4500 మంది రైతులు 13400 ఎకరాల్లో పంట నమోదు చేయించుకున్నారని, కంది, పొగాకు, పత్తి, మిర్చి పంటలను సాగు చేశారన్నారు. ఈకేవైసీ చేయించుకోక పోతే ప్రభుత్వం ద్వారా వచ్చే పంట నష్టం, బీమా పథకం వర్తించదని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్నా ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సోమవారం వ్యవసాయ సహాయకులను సంప్రదించి చేయించుకోవాలని తెలిపారు.

రోడ్డుపై గుంత పూడ్చిన యువకులు


గుంతను పూడ్చుతున్న యువకులు

కురిచేడు: మండలంలోని వెంగాయపాలెం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడ్డ గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఆ శాఖ అధికారులు గుంతను పూడ్చక పోవటంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనిని గమనించిన యువకులు పాత ఇనుము వ్యాపారం చేసే మస్తాన్, మోటార్‌బైక్ కన్సల్టెన్సీ అధినేత దర్గారెడ్డి, మెకానిక్ హుస్సేన్ మరి కొందరు కలిసి ఆ గుంతను తమ సొంత ఖర్చులతో కంకర, మట్టి తెచ్చి పూడ్చారు. ఆ దారిన వెళ్లే వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గుంటి గంగా భవానికి ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న గుంటి గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు (దర్శి): మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. అమ్మవారికి తెల్లవారు జామున అభిషేకం, అష్టోత్తర శతనామావలి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యంనివేదనచేశారు. భక్తులు కొబ్బరి కాయలుకొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వానరాలకు బంధనాలు


సాక్షి ఎఫెక్ట్..
బోనులో ఉన్న కోతులు

దర్శి: నగర పంచాయతీలో సంచరిస్తున్న కోతులను పట్టుకుని అడవిలో వదిలేస్తున్నారు. ఇటీవల సాక్షి దిన పత్రికలో కోతులు బెడద పై ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రచురించారు. దీంతో స్పందించిన నగర పంచాయతీ కమిషనర్ మహేష్ ప్రత్యేకంగా కోతులు పట్టే వారిని పిలిపించి బోనులు తెప్పించి పట్టణంలోని అన్ని వీధుల్లో కోతులను బంధిస్తున్నారు. అనంతరం అడవిలో వదిలి వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

కూలీల ఆటో బోల్తా - ఆరుగురికి గాయాలు


గాయపడిన వారిని 108లో తరలిస్తున్న దృశ్యం

దర్శి: కురిచేడు రోడ్డులోని సాగర్ కెనాల్ వద్ద కూలీలు ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోలో వెళుతుండగా సాగర్ కెనాల్ వద్దకు వచ్చే సరికి కుక్క అడ్డం వచ్చింది. కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వెన్నపూస మంగమ్మ, వెన్నపూస రజిత, ఆర్. నారాయనమ్మ, ఎం. వెంకయ్యకు గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా పైలెట్ నరేష్ ఈఎంటీ ఎస్ ప్రసాద్‌లు వారికి ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు

దర్శి: మోడల్ స్కూల్స్‌కు సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలని ఏపీఎమ్‌ఎస్‌ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మోడల్ స్కూల్‌లో జిల్లా గౌరవ అధ్యక్షుడు కె. పూర్ణ చంద్రరావు అధ్యక్షతన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన 21 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టి ఆదుకోవాలని కోరారు. హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా పసుపులేటి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా కె. ఏడుకొండలు, ట్రెజరర్‌గా ఏ. పాండురగస్వామి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె. ఎర్రయ్య వ్యవహరించారు. జిల్లా అధ్యక్షునిగా ఎంపికై నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీజీటీ తెలుగు పోస్టును పీజీటీ తెలుగుగా అప్డేట్ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ రమేష్‌బాబు, కె. మునిరత్నం, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వి. హరి తదితరులు పాల్గొన్నారు.